కథ

# ఎమ్.పి.గారు ఫోన్ చేసేరు

-భరాగో

అసలు దీనంతటికీ మూలకారణం మా బాబూరావు.

బాబూరావంటే ఎవరికి మాత్రం ఏం తెలుస్తుంది!

**వాళ్ళసలు మహారాష్ట్ర నుంచి వచ్చారు. ఇరవై ఏళ్ళ నుంచీ మా పొరుగింట్లో ఉంటున్నారు. పూర్తి పేరు బాబూరావ్ దేశ్‌ముఖ్, అతని భార్య దుర్గాబాయి, మా దొడ్డ ఇల్లాలు.**

ఓనాడు నేనొక్కణ్ణీ ఇంట్లోకూచుని ఏదో కథో కాకరకాయో రాసుకుంటున్న సమయంలో మా పెద్దబ్బాయి వీధిలో ఆడుకుంటున్నవాడల్లా పరిగెట్టుకుని లోపటికొచ్చేసి "నాన్నా, ఆవిడొచ్చేరు!" అన్నాడు.

అదేదో సినిమా పేరులాగ వినిపించడానికి అప్పటికింకా అలాంటి టైటిల్సున్న సినీమాలు రావడం లేదు.

"ఆవిడంటే ఎవర్రా!" అన్నాను.

"ఆవిడే నాన్నా, దుర్గాబాయి దోసెముఖ్" అన్నాడు మా అబ్బాయి.

నాకు వెంటనే వెలిగింది. "నీ మొహం. దోసెముఖ్ కాదురా, వెధవా, దేశముఖ్!" అని వాణ్ణి నెమ్మదిగా కసిరి చిన్న టెంకిజెల్ల కొట్టేను.

"దుర్గాబాయి దేశముఖ్ అనే ఆవిడ, ఎప్పుడో పోయార్టగదా."అని మావాడు కొంచెం తడుంకుంటూ గొణుగుతూండగా ఆవిడ లోపలికి రానే వచ్చింది.

ఇంటికెవరో గెస్టులొచ్చేరనీ, సడెన్‌గా చూసుకుంటే టీపొడి అయిపోయిందనీ ఆవిడ నవ్వుతూనైనా దీనంగా చెప్పింది. ఆవిడకి టీపొడి అప్పిచ్చి పంపేశాను.

కాని మా అబ్బాయి ఆవిడకి పెట్టిన పేరు మాత్రం అలా ఉండిపోయి ఆవిడ ఆ పదిహేనేళ్ళబట్టీ మా ఇంట్లో వరకూ దుర్గాబాయ్ దోసెముఖ్‌గానే వ్యవహరించబడుతోంది.


ఓసారి మా ఆవిడ "దోసెముఖ్ ఏమిటి, తప్పు! దోసె గుండ్రంగా ఉంటుంది. ఆవిడ మొహం త్రిభుజా కారంలో కదా ఉంటుందీ!" అని మా అబ్బాయిని వ్యతిరేకించబోయిందిగాని; మా అబ్బాయి, తనూ తన క్లాస్మేట్ రంగారావూ కలిసి టిఫిన్ తిన్న ఓ హొటల్లో దోసె ముక్కోణాకారంగా మడతపెట్టి ప్లేట్లో పెట్టి తెచ్చిన సంగతి వివరించగానే ఇహ మాటాడకండా పూరుకుంది.

అదంతా వేరేసంగతి.

చెప్పేను కదా, దీనికంతటికీ మూలకారణ బాబూరావని! బాబూరావు కొడుకు శివాజీ; డైరెక్ట్‌రిక్రూట్‌మెంటులో డిప్యూటీ తాసిల్దార్‌గా సెలెక్టయ్యాడు.

ఏడాదో పదహారు నెలలో ట్రెయినింగ్ అయిందనిపించి అతన్ని ఆ జిల్లాకే వేసినా; ఆ వెయ్యడం వెయ్యడం ఎకాఎకి "పాడేరు" ఏజెన్సీ ఏరియాలో పడేశారు.

ఎక్కడో ఓచోట - అయినా ఆ జిల్లాలోనే



కదా వేసేర్షు. ఉద్యోగికి దూరభూమి, ప్రియవాదికి శత్రువూ బుద్ధిమంతుడికి అసాధ్యమూ లేదని కదా నీతిచెంద్రిక అని కొన్నాళ్ళూరుకున్నా; ఓ యాడాదయ్యే సరికి దుర్గాబాయీ, బాబూరావూ; మా వాడికింక ఆ కొండలే గతికాబోనని గిలగిల్లాడిపోడం మొదలెట్టేరు.

"శివాజీని ఈ ఊళ్ళో ఏదో ఓ పోస్టులో వేసే నాథుడు లేట్టండీ?" అని నా చెవిలో "పొరుగిల్లు" గట్టుకుని గొడవచేసేరు.

"ఈ ఊళ్ళో శివాజీని ఏదో 'పోస్టు'లో వెయ్య డానికివాడేమైనా కార్డా కవరా –" అని నేను వేళాకోళం చేసినా ఊరుకున్నారు కాదు.

ఎవరో చెప్పేరుట; పరిటయ్యగారు నామాట తీసెయ్యరనీ, నేనేంచెప్తే అది సుగ్రీవాజ్ఞలా పాటిస్తారనీనూ.

పరిటయ్యని బాబూరావు 'పరిటయ్యగారూ' అన్నాడంటే అదికేవలం నా సంతోషంకోసమే తప్ప; అతనికీ నాకూ మధ్యవున్న అనుబంధం తెలీక్కాదు.

పరిటయ్యదీ మాదీ ఒకే ఊరు. మా తండ్రిగారి హయాంలో పరిటయ్యగారి కుటుంబం మా భూములన్నీ సేద్యం చేస్తూ ఉండేవారు.

ఇనాముల చట్టం ప్రకారం సాగు హక్కు ఏర్పడి మా భూములన్నీ వాళ్ళకి సంక్రమించేయి.

ధర్మిళ్లాను పరిటయ్య గ్రామంలో ఉండి చేసేదేమీ లేకపోడం వల్ల రాజకీయాల్లో దిగి గ్రామసేవకి మించిన దేశ్సేవ చేస్తున్నాడు.

ఇవన్నీ వివరంగా బాబూరావు తెలుసుకునే ఒచ్చాడు నా దగ్గరకి.

"మీరెలాగైనా పరిటయ్యగారికి మా బాధంతా చెప్పి మావాణ్ణి ఈ ఊరికి ట్రాన్స్ఫర్ చేయించేరా; మీ చెర్మంతో నా చెప్పులు కుట్టించుకుంటాను." అన్నాడు బాబూరావు.

హాల్లోకి తీసికెళ్ళేడు.

"అయ్యో మాగురుంచి వారందరికీ వెయిటింగు చెప్పేరే" అని బాబూరావు మర్యాద చేసేడు.

"సర్లే అంతా మనోళ్లే... ఓసారి ఏటయిందంటే" అన్నారు పరిటయ్యగారు.

"అంతా బాగున్నారా?" అనినేను పలకరించేను.

"బాక్కాక మరేటి. అయినా మనకేటి లోటు? ప్రెహల్లాదుళ్ళాటి కొడుకున్నాడు! ఇబీసనుడ్లాటి తమ్ముడున్నాడు. శ్రీకుష్ణుడ్లాటి మేనల్లుడున్నాడు!" అన్నారు పరిటయ్యగారు.

పరిటయ్యగార్ని చూడగానే హిరణ్యకశిపుడూ, రావణబ్రహ్మ, కంసమహారాజూ లాంటి పురాణ పురుషులు జ్ఞాపకం ఒస్తారని తెలుసు గాని అతనికి ఇలాటిలాటి ఆప్త బంధువులున్నారని

**మనకేటి లోటు? ప్రెహల్లాదుళ్ళాటి కొడుకున్నాడు! ఇబీసనుడ్లాటి తమ్ముడున్నాడు. శ్రీకృష్ణుడ్లాటి మేనల్లుడున్నాడు!**



ఎరగన్నేను.

అంచేత ఎందుకైనా మంచిదని ఊరుకున్నాను. ఊరుకున్నవాణ్ణి ఉలికించడం ఎందుకన్నట్టుగా పరిటయ్యగారు బాబూరావుని చనువుగా పలకరించి సంగతేమిటో సగం రాబట్టేశాడు.

ఆ మాట వినగానే మా ఆవిడ లోపల్నించి సంజ్ఞచేసి నన్నుపిలిపించింది. "అదేమిటండీ అలా అంటాడతనూ; మీ చెర్మంతో – అవ్‌–వ్వ! – తను చెప్పులు కుట్టించుకుంటాడా?" అంది.

"పొరుగుభాషలో ఉన్న "ఇడియమ్స్"నీ పొరుగు డాబా మీద ఎండేసిన "ఒడియమ్స్"నీ అంత సుళువుగా సాధించలేం." అని మా ఆవిడకి బోధపర్చి తశ్శాంతి చేసేను.

నేనక్కడికీ చెబుతూనే వున్నాను. రాజకీయవాదుల మీద మరీ అంత ఎక్కువగా భరోసా వుంచుకోకూడదని.

"ఏం ఆయనకి మీ కుటుంబం మీదా, మీ మాట మీదా గౌరవం ఉండదంటారా?" అన్నాడు బాబూరావు దేశ్ముఖ్.

"ఆయ నీవూ రెవ్వుడొస్తారో హైద్రాబాద్‌లో ఆయనకో చిన్నిల్లు వుంధిటకదా. అక్కడికే పోయి మాట్లాడదాం పదండి" అని నన్ను లాక్కెళ్ళేడు.

పరిటయ్యగారికి హైదరాబాదులో ఉన్నది చిన్నిల్లే అంటే ఏమిటో అనుకున్నాను గానీ అది నిజానికి పెద్దిల్లే. ముందున్న రిసెప్షను హాలే ఉంది. మా ఇంటికి రెట్టింపంత ప్లింత్ఏరియాలో.

మేం వెళ్ళగానే ఆ హాల్లో వేరే వేరే సోఫాల్లోనూ ఉన్న ఏడెనిమిది మందితోనూ, "ఇప్పుడే వత్తాను కూకోండి" అని చెప్పేసి మమ్మల్ని లోపటి

"అయితే మీరు నాకాడికి రికమెండిసన్ కోసమొచ్చారన్నమాట. అలాజేప్పండి. ఓసారేం జరిగిందంటే–" అన్నారు పరిటయ్యగారు.

"ఆయ్..." అన్నాడు బాబూరావు.

"రికమండిసనంటే మా దత్తారం రాయుడు గారిదే రికమండిస ననుకో. ఆ ఊళ్లో వో కుర్రోడు బియ్యేసదివి వుజ్జోగం కోసానికి ఆళ్ళ కాళ్ళూ ఈళ్ళకాళ్లూ పట్కొని కిందామీదా బడ్తాంటే– రాయడుగారేంజేసేరెరుగుదువా?"

ఓర్నీతస్సాదియ్యా; ఉజ్జోగమంటే మీద మీదుంట్రేబ్బాయ్, నీ నుత్తరమిత్తాను; మెడ్రాసెల్లి ముక్యమంత్రి గార్ని కల్చుకో!" అన్జెప్పి; శార్జీలికి ఊళ్ళో వొడ్డీ వేపారం జేసే సుబ్బయ్యకి బెత్తాయించి ఉత్తరమిచ్చి పంపేడన్నమాట. ఏటి, ఇంట్నావా?"

"ఆ ఆ"

"అద్గది. ఆ వుత్తరముచ్చుకుని ఆ కుర్రోడు మెడ్రాసెల్లేడయ్యా. ఏటి; మెడ్రాసంటే మన యిజానారమా అనకాపెల్లా పెద్ద శిటీ గదా. ముక్కెమంత్రి గార్ని కల్చుకోవాల్నంజెప్పి తెగతిరిగీవానాడు! శివరికెలాగయితే నేటి;

బంగ్లాకాడికెల్నాడు. ఐతే ఈ అబ్బాయి ఆ ఉత్తరం ఇస్తప్పుడికి అక్కడోల్లంతా ఒకటే ఇదిగా నవ్వేరట. కడుపు సేత్తో బట్టకునాకడూ, కిందబడి దొర్లీసాకడూ ఇలాగ. ఆళ్ళెందుకు నవ్వుతన్నో ఈడికి దెలీకయెర్రి మొగమెస్కున్నిలబడిపోనాడట. ఆ కరు(వు)కి అందులో ఒకడు ఈ కుర్రోడి అవస్థాసి అసల్సంగజప్పాడట! 'ఓరబ్బీ; ఈ ఉత్రం మీదెద్రస్సుడు; అంతోఇంతో సదూకున్నోడివి గదా" అని. మహారాజశ్రీ గౌర్వనీయులైనట్వంటి కామరాజనాడారు ముక్యమంత్రి గారికి- అయ్యా; నాపేరు దత్తారం రాయిడంటారండి. లోగడ మనం ఉమ్మడి మద్రాస్ రాస్ట్రంలో దేస్సేవజేసాం- ఇలాగేశుందట, ఆ సిపార్సుత్తరం; అదే- రికమిండిసన్ లెట్రు. కామరాజు నాడారు గారు ఎప్పుడో కైలాసానికెలిపోయేడనీ, ఒహేల ఉన్నాసరే ఆయినికి అర్వం తప్ప ఇంకో బాసరాదనీ రాయిడుగారికి తెలీకపోతే నీకూ తెల్దా' అని ఆల్లంతా జెప్తలికి- ఈ కుర్రోడు లభో దిభోమంటూ ఎనక్కొచ్చీసినాడు."

పరిటయ్యగారు ఈ ఉదంతం అంతా చెప్తున్నంతసేపూ కొంచెం కొంచెం చొప్పున నవ్వుతూ కూచున్న బాబూరావు; కధ చివరి పేరాకొచ్చేసరికి లేచి నిలబడిపోయాడు.


"అబ్బ! అబ్బ! నేన్నవ్వలేక పోతున్నానండీ. కడుపులో నెప్పొస్తోంది!" అంటూ పక పక, వికవిక, చక చక నవ్వేడు.

"కూకోండి, కూకోండి!" అని పరిటయ్యగారు బహుప్రసన్నులై చెప్పేరు.

"దత్తారం రాయుడుగార్జేసిన ఆ రికమిండిసనలాగై పోయిందిగాని ఆ తరవాతి కోసారేటైందో యెరుగుదురా?... సుబరమన్నెమని ఆ కుర్రోడు. మెడ్రాసెల్నందుకు పనిగాకపోగా నాలుగొందలు రూపాయిలు అప్పయిపోయిందని రోజూ రాయిడుగార్దగ్గిర మొరెట్టుకుంటుండే వోడు. ఓనాడేటైందంటేనండీ; ఒక బాంకీలో కేసీరుజ్యోగాలు కాలీలున్నాయని పేపర్లో పడ్డాదండి. రోజూ ఒద్దుగూకే తలికొచ్చి, మొరెట్టుకుండే సుబ్బరమన్నేన్ని పొద్దుట పదింటికీ కబురెట్టి రప్పించీస్కున్నాడండి. 'ఈ పట్టు జూస్కో మంతడాకా' అన్జెప్పి ఆ బాంకీ చేర్మేన్ గారికే ఎకామెకిని రాసిచ్చీసేడండి; రికమిండీసను లెటరు. ఆ బేంకీ చేర్మేనుగారు ఇసాకపట్టంలో వున్నారెళ్ళా అని తరిమాడండి. ఎల్తే అక్కడేటయిందంటారేటి?" అని ఉత్కంఠ కాపాడ్డం కోసమో, గుక్కతిప్పుకోడానికి మంచినీళ్ళు తాగడం కోసమో బ్రేక్ కొట్టాడు పరిటయ్యగారు.

"ఈసారేం జరిగిందండీ?" అని కుర్చీలో ఎటెన్‌షన్‌గా కూర్చున్నాడు బాబూరావు.

"అదే సెప్తున్నాను. ఈయబ్బాయి పేరు సుబ్బరమన్నెం కదా. ఆ బేంకీ చేర్మేన్ గారి పేరూ సుబ్బరమన్నెమే. ఆ లెక్కొటీనీ, దత్తారం రాయుడుగారయిన తమకి ఆదే బేంకీలో యకవుంటుండడం వాకటేనీ." ఈ కార్నాలవల్ల ఈ నీటీతెచ్చే కుర్రోడికి ఉజ్జోగం ఇప్పించవలసిందీ" అని రాసీనాడు. ఆ రికమిండిసన్ లెటరు, ఆ ఉత్తరం సూసి బేంకీ చేర్మేనుగారే సాయంగా బోల్డంతసేపు నవ్వేసేరు. దత్తారం రాయిడుగారెంత అమాయికుడో, ఉత్తరం దెచ్చిన




## ఏలకులూ - ఆరోగ్యం

పంటినొప్పి తగ్గాలన్నా, జీర్ణశక్తి పెరగాలన్నా, కంటిచూపు మెరుగు కావడానికీ, నోటి దుర్వాసనకు, గొంతునొప్పి, దగ్గు, జలుబుకు... ఒక్కటేమిటి సర్వ బాధానివారిణి ఏలకులు! అందుకే ఏలకులు నమలండీ... ఆరోగ్యంగా ఉండండి.

కుర్రోడెంత అమాయికుడో ఆయినికి దెల్సిపోయింది. 'అయితే అబ్బాయీ, నీకు బేంకీకేసీరు పనిగాదు గానీ మా ఎగ్స్‌పోర్టు కంపినీలో సిన్న ఉజ్జోగం ఇత్తాను జేసుకో' అనీ సేడండి." అని ఆ కధ ముగించేడు పరిటయ్యగారు.

"పోన్లెండి పాపం. ఏదో వుపాధంటూ చూపించేడు." అన్నాడు బాబూరావు.

కధ పక్కదారి పట్టేస్తోందని నా కనిపించి, "మరి మా బాబూరావు కొడుక్కి- అదే, వీళ్ళబ్బాయికి- ఆ ఏజన్సీ ఏరియానుంచి టౌనేరియాకి ట్రాన్స్ఫరు చెయ్యమని ఎవరికో ఘట్టివారికి చెప్పాలికదా." అన్నాను.

"ఒస్తా వొస్తా" అన్నాడు పరిటయ్యగారు. టేబిల్ సొరుగులాగి, అందులోంచి ఓ పుస్తకం తీసేరు.

ఆ పుస్తకం అట్టమీద ఒక టెలిఫోన్ బొమ్మ ఉంది. పరిటయ్యగారు ఆ పుస్తకం పేజీలు చెకచెకాతిప్పుతూ ఉండగా నేను బాబూరావు చెవిలో "ఎవరికో ఫోన్‌లో చెప్పేస్తాడు, చూడు." అన్నాను.

"నే చెప్పేనుగా, ఆయన తల్చుకుంటే మందేమంత కష్టమైన పని?" అన్నాడు బాబూరావు.

"అది కాదులే. ఇలాటి విషయాల్లో ఉత్తరాలు రాయడం అంత మంచిది కాదు. అందుకని ఫోన్ చేస్తున్నాడు." అన్నాను.

"అలో-" అని ప్రారంభించేడు పరిటయ్యగారు.

"ఆ; ఎవురదీ; రెవిన్యూ సెక్రెటి మాదవయ్యగారి బంగ్లాయేనా? నంస్కారం సార్; నంస్కారం. నేను ఎంపీ పరిటయ్యని మాట్లాడతన్నాను. ఆ ఆ నంస్కారం. ఏటి, బావున్నారా... మరెండి... సిన్న పని బడ్డాదండి తమర్తోటండి... బయిల్దేరొచ్చిద్దామనుకున్నాను గానండి; ఉంకో అరగంట్లో సీయమ్‌గారింటికెల్లాలగదా, లేటె

పోతాన్నమోని ఫోన్ జేత్నానండి... ఏ వంత పెద్దపని గాదండి. సివాజీ అన్జెప్పి మాక్కావల్సిన కుర్రోడండి. ఈ మజ్జెనే డిప్పుటి తాసిల్దార్‌గా సెలక్సనయ్యేడండి. టెయినింగూ అయి పోయిందండి. ఓ సంవక్షరం సర్వీసూ అయిందండి. ఆడికర్మేటోగానండి, టవున్లల్లోనూ నండి, జిల్లా ఎడ్ కోటేర్స్‌లోనూ నండి ముప్పయి జాగాలున్నా ఆణ్ణి ఏజెనిసీలో ఏస్సేరండి. ఏస్తే ఏసేరుగానండీ గోడకి మేకేసి కొట్టేసినట్టు అక్కడే ఒగ్గిస్తే ఎలాగండీ? అంచేతండి; ఆయబ్బాయికి- టవునేరియాకి టాన్స్‌పర్ జేయించాలండి. ఆయి. తమరన్నది రైటేనండి. నేనే కల్లెట్రుగారికి జెప్పొచ్చండి. కానీ పార్‌లమెంటు సెసన్సు గదండి ఎల్లుటికాణ్ణండి? ఇట్నేండి లాగే ఎలిపోవాలండీ. అయినా సరేనండీ సిన్న పావునైనా పెద్దకర్రతో గొట్టమని కదండీ మన పూరువీకులు జెప్పినారు! అదలా గుణ్ణిచ్చండొ; మీకాడున్న సనువూ పరిసిపాటూ కల్లెట్రుగారి దెగ్గిరెలా గొత్తాయండి.,. సరే, సరే నండి... ఆయ్! మరేటండి బోగట్టాలు. అబ్బాయిగారు అమెరికా ఎల్లాలన్నారు పన్లన్నీ సజావ్‌గా అవుతున్నయండీ? ఏదేన అవసరముంటే జెప్పండిసార్. ఆలాగె అలాగె. ఆయి. సరెనండి... ఆయబ్బాయి పేరండీ - సివాజీ అండి సివాజీ. సివాజీ దేశ్మక్కండి... అలాగేనండి... ఉంటానండి... నంస్కారమండి" ఫోన్ పెట్టేశాడు పరిటయ్యగారు.

బాబూరావు లేచి నిలబడి కృతజ్ఞతా పూర్వకంగా నమస్కారం చేసేడు. "థాంక్సుసార్. నన్నుగానీ మా శివాజీనిగాని తమకి ఇంతకి ముందు తెలీకపోయినా పెద్దమనసుతో మాకీ ఉపకారం చేస్తున్నారు. పనైపోయేక మళ్ళీతమరి దర్శనం చేసుకుంటానండి." అన్నాడు.

పరిటయ్యగారు కూడా లేచేరు. "రండి, గురూజీ. ఇల్లంతా చూద్దురుగాని." అని నాతో అన్నాడు.

గుట్టుగా నాతో చెప్పవలసిందేదో వుందని నాకు అర్థమైపోయింది కదా.

అంచేత బాబూరావుతో "మీరు బైఠహాల్లో ఉండండి. ఇప్పుడే వచ్చేస్తాను." అని చెప్పేను.

బాబూరావు పరిటయ్యగారికి మరో నమస్కారం చేసి హాల్లోకి వెళ్ళిపోయేడు.

"ఏమిటి, సంగతి?" అని నేను పరిటయ్యగారి టేబిల్ దగ్గిరిసా వెళ్ళేను.

పరిటయ్యగారు డ్రమేటిక్‌గా ఫోన్ మొత్తం పైకెత్తి పట్టుకున్నారు. అటూ ఇటూ తిప్పి నాకు ఆ యంత్రాన్ని చూపిస్తూ చిరునవ్వు నవ్వేరు.

నా కళ్లు బైర్లు కమ్మేయి.

ఆ ఫోనుకి ఏ విధమైన వైర్లూ లేవసలు. అంటే ఏమిటన్నమాటా? ఆయనగారు ఇంతసేపూ ఫోన్‌లోనే మాట్లాడేరు గాని ఎవరితోనూ మాట్లాడలేదన్నమాట.

...నేను అరిచేత్తో నోరు మూసుకున్నాను. "అయ్యో!" అనేసి.

"సారీ గురూజీ, అదంతే. ఇలాంటి కేసులు మనం టేకప్చెయ్యకూడదు. క్షమించండి." అన్నాడు పరిటయ్యగారు.

"మరేంటీ, సంగతులూ? పిల్లలాళ్ళూ బాగున్నారా? తిరుగు ప్రయాణం ఎప్పుడు?" అని ఏదో అడగడం మొదలెట్టేడు. నేనేమీ అన్లేకపోడం చూసిజాలిపడిన వాడిలాగ!

"మనం జేసింది రైటంటారా, తప్పంటారా?" అన్నాడు.

"నిజమే. రాజకీయవాదులు ఎవ్వరూ కూడా పరిపాలనా రంగంలో వేలుపెట్టి ట్రాన్స్‌ఫర్లూ ప్రామోషన్లూ లాంటి విషయాల్లో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. అది దేస్సేవ అనిపించుకోదు." అని నేను సెలవుతీసుకొచ్చేసేను.

మా తిరుగు ప్రయాణానికి టిక్కెట్లు ఆ రోజుకి దొరకలేదు గాని మర్నాటికి దొరికేయి.

బాబూరావు ఉషారుగా ఆ రెండు రోజుల పాటూ షాపింగు చేస్సేడు. నాకు మతిపోయినట్టయి కదా? అందుకని ఎక్కువ సమయం రూమ్‌లోనే ఉండిపోయేను- తెచ్చుకున్న పుస్తకాలు చదువుకుంటూ...

మర్నాడు - సాయంకాలం ఐదుగంటలకి రైలు బయల్దేరుతూందనగా మధ్యాహ్నం మూడున్నరకి బాబూరావు రూమ్‌కి చేరేడు.

"ఇందాక సుల్తాన్ బజార్లో మనూరు కలెక్ట్రుగారి పియ్యేగారు కనిపించేరండి... నమస్కారం సార్, అనంగానే- ఏంటి ఇలాగొచ్చేరని భోగట్టా చేసేరండి... సరే, ఇవాళ కాకపోతే రేపయినా ఆయనికి తెలిసేదే గద - అని, మా అబ్బాయి ట్రాన్స్‌ఫర్ సంగతీ, మనం పరిటయ్యగార్ని కల్సుకున్న సంగతీ వారికి మనవి చేసేనండి." అన్నాడు.

ఆ తరవాత వారం రోజులకి-

శివాజీని విశాఖపట్నం టవునేరియాలో ఒక పోస్టులో నియమించినట్టూ, ఆ పోస్టులో పని చేస్తున్న రంగారావుని నాప్లేస్‌లో వేసినట్టూ, నన్ను పాడేరు ఏజెన్సీకి బదిలీ చేసినట్టూ ఆర్డర్స్ వచ్చేయి.

ఆ ఆర్డర్స్ కాగితం చూసేసరికి నాకు ఒళ్ళంతా చెమట్లు కమ్మేసేయి. వెంటనే పి.ఏ.గారి రూమ్‌కి పరుగెత్తేను. చేతిలో సాకుగా ఒక అర్జంటు ఫైలు పుచ్చుకుని.

నేనెళ్ళేటప్పటికి అక్కడ హుజూరు శిరస్తాదారుగారు కూడా వున్నారు.

"సారీ, మిష్టర్ గోపాలమ్!" అని పి.ఏ.గారు డైరెక్టుగా ప్రారంభించేసేరు.

"ఏమిటి, నీ ట్రాన్స్‌ఫర్ గొడవేనా?" అని శిరస్తాదార్‌గారు పలకరించేరు.

"ఆ శివాజీ దేశ్‌ముఖ్‌కి అర్జంటుగా టౌన్‌లో ఓప్లేస్ చూపించవలిసొచ్చింది... ఎవరికో ఒకరికి షిష్ట్ తప్పదు కదా!" అనీసేరు.

"అదికాద్ సార్; నేను మనవి చేసేదేంటంటే - అసలు ఎమ్.పీ.గారు - " అని మొదలెట్టేను గాని శిరస్తాదార్‌గారు సాగనివ్వలేదు.

"అదే, నే చెప్తుంట.. ఎమ్.పీ.గారు సరిగ్గా నిన్నే ట్రాంస్ఫర్ చెయ్యమని చెప్పలేదనుకో, ఐనా నువ్విక్కడ జాయినై మూడేళ్ళు దాటింది, కదా. ఎల్లకాలం ఒకేచోట ఉండి పోవాలని ఎవ్వరూ కోరుకో కూడదు కదా. అందులోనూ ఇదంతా ఎమ్.పి. గారి నోటీస్‌లోకి వెళ్ళింది కనక-"

ఎం.పి. గారి నోటీసులోకి వెళ్ళడం వరకూ రైటే మరి. అంచేత నేను ఏంచెప్పినా ఎవరూ నమ్మరు. ❄

